మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 197
పేజీలు : 3

ఆదివారం 15.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## 4 రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ కసరత్తు

### ఆదివారం తుది ఓటర్ల జాబితా



**టి మీడియా, ఫిబ్రవరి 14 , ఢిల్లీ బ్యూరో :** 4 రాష్ట్రాల ఎన్నికలపై ఈసీ కసరత్తు పూర్తి.. షెడ్యూల్ ఎప్పుడంటేదేశ వ్యాప్తంగా మరో మినీ ఎన్నికల యుద్ధం జరగనుంది. నాలుగు కీలకమైన రాష్ట్రాల్లో ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి. త్వరలోనే నాలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ వార్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు పూర్తి చేసినట్లుగా సమాచారం అందుతోంది. ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటర్ సర్వేను ఇప్పటికే ఈసీ పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్నికల సంఘం తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇక సోమవారం లేదా మంగళవారం తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికల ప్రక్రియను ముగించవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు బోర్డు ఎగ్జామ్స్ ప్రారంభమయ్యాయి. త్వరలోనే విద్యార్థులకు వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల షెడ్యూల్ రావొచ్చని వార్తలు వస్తున్నాయి.ఇది కూడా చదవండిఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో అన్ని పార్టీలు సన్నద్ధమైపోయాయి. తమిళనాడు సీఎం స్టాలిన్ శుక్రవారం మహిళల ఖాతాల్లో రూ.5 వేల చొప్పున జమ చేశారు. ఇక ప్రధాని మోడీ కూడా ఈరోజు అస్సాంలో పర్యటించి పలు కీలక ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు. దీంతో అన్ని పార్టీలు ఎన్నికల సమరంలోకి దిగిపోయినట్లు కనిపిస్తోంది.


### హంగ్ మున్సిపాలిటీలపై...

# కాంగ్రెస్ కన్ను



## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం

### - మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి కార్యచరణపై కాంగ్రెస్? పార్టీ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే మంత్రులు, సీనియర్ నేతలతో జూబ్లీహిల్స్?లోని క్యాంపు ఆఫీస్?లో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల ఫలితాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆశించిన ఫలితాలు రావడంతో సంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం హంగ్ మున్సిపాలిటీల విషయములో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. రైతులకు భరోసా కల్పిస్తూ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నగారా మోగించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### 38 మున్సిపాలిటీల్లో హంగ్

38 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది. వీటిలో సాధ్యమైనన్ని మున్సిపాలిటీలలో అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. స్వతంత్రుల మద్దతుతో సుమారు 20 వరకు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే అవకాశాలున్నాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా తీసుకోవాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అలాగే మేయర్?, ఛైర్మన్? ఎంపిక కార్యచరణపై కూడా ఆయన నేతలకు ఆదేశాలు జారీచేశారు. ఎక్స్? అఫీషియో ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులకు సీఎం సూచనలు చేశారని తెలుస్తోంది.

### సత్తాచాటిన కాంగ్రెస్

రాష్ట్రంలో ఇటీవల జరిగిన పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటింది. మూడొంతులకు పైగా మున్సిపాలిటీలను ఆ పార్టీ 'హస్త'గతం చేసుకుంది. 52శాతానికి పైగా పురపాలక వార్డులను చేజిక్కించుకుని 66 పురపాలికల్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు హంగ్? మున్సిపాలిటీల్లోనూ అత్యధిక పీఠాలను చేజెక్కించుకునే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ఇక్ ఎన్నికలు జరిగిన ఏడు కార్పొరేషన్లలో ఆరింటిని హస్తం పార్టీ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా మంత్రులు, పార్టీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది

### స్థానిక పోరుకు సై?

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో అదే ఊపును కొనసాగించాలని సీఎం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను తక్షణమే నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అంశంపై మంత్రుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పార్టీ పట్టును మరింత బలోపేతం చేసేందుకు ఇదే సరైన సమయమని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నోటిఫికేషన్ ఇచ్చే దిశగా అడుగులు వేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం.



రైతులకు తీపి కబురు

ఈ సమావేశంలో రైతు భరోసాపై మంత్రులతో రేవంత్ చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధులను ఈనెల 17న విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన నిధుల సర్దుబాటు, లబ్ధిదారుల ఎంపికపై సీఎం అధికారులకు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత రైతులకు ఈ ఆర్థిక సాయం అందించడం ద్వారా గ్రామీణ ఓటర్లలో మరింత విశ్వాసం నింపవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

## ఫార్ములా ఈ కార్ రేస్...

3లో..

- అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్

# తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్

### 4లైన్ హైవేకు ఆమోదం!

**టి మీడియా, ఫిబ్రవరి 14 , ఢిల్లీ బ్యూరో :** శనివారం సమావేశమైన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే కర్ణాటకలోని గూడె బేల్లూరు–తెలంగాణలోని మహబూబ్‌నగర్ సెక్షన్ మధ్య రూ. 3,175 కోట్ల ఖర్చుతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీర రహదారి 167 కింద సుమారు 80 కి.మీ మేర ఈ రోడ్డు నిర్మాణం కానుంది. రాయచూర్, నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్ నగర్ మీదుగా హైదరాబాద్‌కు ఉన్న ఈ కనెక్టివిటీకి ఈ కొత్త నాలుగు లైన్‌ల హైవేను అటాచ్ చేస్తూ నిర్మాణం చేపట్టనున్నారు.



#### హైదరాబాదు పనాజీ కారిడార్‌లో 4లైన్ హైవే

దీంతో పాటు హైదరాబాదు పనాజీ కారిడార్‌లో భాగంగా కొత్త నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సైతం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దమాసియా బిటాడ నర్సాపూర్మలోత సెక్షన్ మధ్య నాలుగు లైన్ల నిర్మాణానికి 4,584 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే గోతి– ట్రిమ్బక్ -- పాల్గర్ సెక్షన్ అబ్రిడేషన్ కోసం 3320 కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది.

**రూ. 2,254 కోట్లతో నోయిడా మెట్రో ఆక్వా లైన్**

అలాగే రూ. 2,254 కోట్లతో నోయిడా మెట్రో ఆక్వా లైన్ 11.6 కిమి పొడిగింపుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నోయిడా బొటానికల్ గార్డెన్ నుంచి నోయిడా సెక్టార్ 142 వరకు మెట్రో లైన్ పొడిగింపునకు నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. అలాగే రూ. లక్ష కోట్లతో అర్బన్ చాలెంజ్ ఫండ్ కి కేబినెట్ ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రాష్ట్రాలకు రుణసాయం చేయాలని నిర్ణయించింది. స్టార్టప్ ఇండియా ఫండ్ 2.0 కి 10 వేల కోట్ల కేటాయింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 13.3 లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపింది. 2024 లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 1,89,601 కోట్లతో 49 రైల్వే ప్రాజెక్టులకు , రూ. 2,48,053 కోట్లతో 24 జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేంద్రం చేపట్టింది. అలాగే రూ. 1,15,406 కోట్లతో 9 మెట్రో ప్రాజెక్టులు, రూ. 7,339 కోట్లతో నాలుగు నూతన ఎయిర్పోర్టుల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది.రూ. 1,45,945 కోట్లతో పోర్టు నిర్మాణానికి, రూ. 6,811 కోట్లతో రెండు రోప్ వే ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రం చేపట్టింది. అలాగే 3 హైడ్రో ప్రాజెక్టులకు గాను బడ్జెట్‌లో రూ. 28,432 కోట్ల నిధులను కేటాయించింది. అంతేకాకుండా రూ. 28,602 కోట్లతో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు అమోదం తెలిపింది. పీఎం ఆవాస్ యోజనకు కింద రూ. 5,36,137 కోట్లు కేటాయింపు చేసింది.

### రూ. 3,32,205 కోట్లతో

# "పయ్యావుల" బడ్జెట్

### -రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు,

**టి మీడియా ,ఫిబ్రవరి 14, అమరావతి:**




**ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర బడ్జెట్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు పయ్యావుల కేశవ్. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 2,56,143 కోట్లు, మూలధన వ్యయం రూ. 53,915 కోట్లగా అంచనా వేశారు. రెవెన్యూ లోటు రూ. 22,002 కోట్లు, ద్రవ్య లోటు రూ. 75,868 కోట్లగా అంచనా వేశారు. బడ్జెట్ ప్రకారం.. వివిధ పథకాలు, శాఖలను కేటాయించిన బడ్జెట్ వివరాలు ఇలా ఉన్నాయి.పాఠశాల విద్య- రూ. 32,308 కోట్లు..బీసీ సంఘాల కోసం- రూ. 23,650 కోట్లు.పంచాయతీ రాజ్ -- రూ. 22,941 కోట్లు..వైద్య ఆరోగ్య శాఖ -- రూ.19,306 కోట్లు..జలవనరుల శాఖ- రూ.18,223 కోట్లు..మున్సిపల్ శాఖ- రూ.14,538 కోట్లు..ఇంధన శాఖ -- రూ. 13,934 కోట్లు.వ్యవసాయ శాఖ -- రూ. 11,118 కోట్లు..సాంఘిక సంక్షేమ శాఖ- రూ.11,118 కోట్లు.. ఇ డబ్ల్యు ఎస్ సంక్షేమం -- రూ.10,699 కోట్లు...తల్లికి వందనం -- రూ. 9668 కోట్లుమహిళా శిశు సంక్షేమం -- రూ. 4581 కోట్లుస్కాలర్షిప్స్ -- రూ. 3836 కోట్లుసమగ్ర శిక్షణ -- రూ. 2946 కోట్లుఉన్నత విద్యాశాఖ -- రూ. 2566 కోట్లుడొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం- రూ. 2161కోట్లుమనబడి మన భవిష్యత్తు -- రూ. 1500కోట్లుస్కిల్ డెవలప్మెంట్- రూ.1232 కోట్లుపీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా -- రూ. 707 కోట్లు.సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర -- రూ. 654 కోట్లు.యూత్ అండ్ స్పోర్ట్స్ -- రూ. 438కోట్లుఅమరావతి. కోసం- రూ. 6000 కోట్లు కేటాయింపుసాగునీటి ప్రాజెక్టులకు -- రూ. 9906కోట్లుఅన్నదాత సుఖీభవ- రూ. 6600పోలవరం- రూ. 6105రాష్ట్రీయ కృషి వికాస్ యోజన -- రూ. 1927మత్స్యకార సేవ -- రూ. 260కోట్లుధరల స్థిరీకరణ నిధి -- రూ. 500 కోట్లుక్రాప్ ఇన్సూరెన్స్ -- రూ. 250కోట్లుపీఎం కృషి సించాయి యోజన -- రూ. 190 కోట్లు..పర్యావరణం, అటవీ, విజ్ఞాన శాస్త్రం- రూ.714 కోట్లుపట్టణభివృద్ధి శాఖకు- రూ.14539 కోట్లు.**

## 30 పైగా గెలుచుకుంటామని అనుకున్నాం

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్ బ్యూరో :** 30 మున్సిపాలిటీలకుపైగా గెలుచుకుంటామని అనుకున్నాం కానీతెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపు, హంగ్ మున్సిపాలిటీల్లో వ్యూహాలు, ప్రతిపక్షాల పనితీరుపై ఆయన తన విశ్లేషణను పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సుమారు 30కి పైగా మున్సిపాలిటీలను సొంతం చేసుకుంటుందని భావించినప్పటికీ, తుది ఫలితాల్లో ఆ సంఖ్య కొంత మేర తగ్గిందని ఆయన అంగీకరించారుఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని (హంగ్) మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఛైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన 'ఎక్స్ అఫీషియో' ఓట్ల నమోదు విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ (రాజుజ) అధికారులతో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తమ పార్టీకి ఉన్న ప్రజాప్రతినిధుల మద్దతుతో హంగ్ ఏర్పడిన చోట్ల కూడా పట్టు సాధిస్తామని స్పష్టం చేశారు.మున్సిపల్ ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని కేటీఆర్ విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ గాలిలో మేడలు కట్టింది కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు వారికి ఆశించినన్ని మున్సిపాలిటీలు ఇవ్వలేదు" అని ఎద్దేవా చేశారు. ఇక బీజేపీ పరిస్థితిని ప్రస్తావిస్తూ.. కరీంనగర్, నిజామాబాద్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ప్రభావం శూన్యమని కొట్టిపారేశారు.స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కొలమానం కాబోవని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. స్థానిక సమస్యల ప్రాతిపదికన జరిగిన ఈ ఎన్నికల ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో చర్చనీయాంశంగా మారిన ఫార్ములా–ఈ రేస్ కేసు గురించి ప్రస్తావిస్తూ.. ఆ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, దీనిపై అధికారులే స్పష్టత ఇస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పార్టీకి కొత్త పాఠాలను నేర్పాయని, భవిష్యత్తులో ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# కన్నతండ్రే కాలయముడు

## పసికందు గొంతు కోసి హత్య

**టి మీడియా, ఫిబ్రవరి 14 , లాలాపుర్వా :** రక్షించాల్సిన తండ్రే రాక్షసుడిగా మారాడు. భార్యతో జరిగిన చిన్న గొడవకు అభం శుభం తెలియని 8 నెలల పసికందును బలి తీసుకున్నాడు. కన్నకూతురు అని కూడా చూడకుండా, అత్యంత కిరాతకంగా కత్తెరతో చిన్నారి గొంతు కోసి హతమార్చాడు. ఆపై తాను కూడా ఆత్మహత్యకు యత్నించాడు. గుండెలు పిండేసే విషాద ఘటన రాజస్థాన్ జైపుర్‌లోని మాల్పురా గేట్ పోలీస్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఫిబ్రవరి 6న ఈ ఘటన జరిగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు కోలుకున్న తర్వాత శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు.



### అసలేం జరిగింది?

జైపుర్ ఈస్ట్ డీసీపీ సంజీవ్ నైన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్?ప్రదేశ్‌లోని లాలాపుర్వా ప్రాంతానికి చెందిన షాదాబ్ మహ్మద్ అనే వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టాడు. షాదాబ్ మహమ్మద్ పూణేలో పని చేస్తున్నాడు. అతని భార్య, 8 నెలల కుమార్తె షెహనాజ్‌తో కలిసి రాజస్థాన్? జైపుర్‌లోని సాంగనేర్ ప్రాంతంలో ఉన్న తన పుట్టింటికి వచ్చింది. ఆమె వచ్చిన రెండు రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 6న పుణెలో ఉంటున్న భర్త షాదాబ్ కూడా జైపుర్‌లోని అత్తగారింటికి చేరుకున్నాడు. అదేరోజు ఉదయం ఉదయం 10 గంటలకు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనతో పాటు వెంటనే తమ ఇంటికి తిరిగి రావాలని షాదాబ్ తన భార్యను అడిగాడు. మరో మూడు నాలుగు రోజులు ఆగి వస్తానని ఆమె చెప్పింది. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. అది పెద్ద గొడవకు దారితీసిందని పోలీసులు తెలిపారు. దీంతో కోపంతో ఊగిపోయిన భర్త షాదాబ్ విచక్షణ కోల్పోయాడు. భార్యపై దాడికి దిగాడు. ఆమె గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన బావమరిది (భార్య తమ్ముడు) సోహిల్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో షాదాబ్ పక్కనే ఉన్న టీ కెటిల్ తీసుకుని సోహిల్ తలపై బలంగా కొట్టాడు. గొడవ పెద్దది కావడంతో చుట్టుపక్కల వారు, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. షాదాబ్ శాంతింపజేశారు. గొడవ సద్దుమణిగిందని అందరూ భావించారు.

### గదిలో మృత్యుఘోష

అందరూ అక్కడి నుంచి వెళ్లిపోగానే షాదాబ్ రాక్షసుడిగా మారాడు. 8 నెలల తన చిన్నారిని ఎత్తుకుని ఒక గదిలోకి వెళ్లాడు. లోపల నుంచి గడియ పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న పదునైన కత్తెరను తీసుకున్నాడు. ఏ పాపం తెలియని కన్నబిడ్డ గొంతును ఆ కత్తెరతో కోసేశాడు. ఆ తర్వాత చిన్నారి మృతదేహంపై దుప్పటి కప్పి ఉంచాడు. అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవడానికి షాదాబ్ ప్రయత్నించాడు.

### తలుపులు పగులగొట్టి చూస్తే

గదిలో నుంచి ఎంతకీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులకు షాదాబ్?పై అనుమానం వచ్చింది. పొరుగువారి సాయంతో తలుపులు బద్దలు కొట్టారు. లోపల నిందితుడు గాయాలతో పడి ఉన్నాడు. పాప ఎక్కడ అని వెతకగా, దుప్పటి కింద రక్తపు మడుగులో పసికందు కనిపించింది. ఆ దృశ్యం చూసి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.

సమాచారం అందుకున్న మాల్పురా గేట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తమోడుతున్న చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పాప మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన నిందితుడు షాదాబ్‌ను సవాయ్ మాన్‌సింగ్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

### నిందితుడి అరెస్ట్

భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షాదాబ్ శుక్రవారం కోలుకున్నాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జైపుర్ ఈస్ట్ డీసీపీ సంజీవ్ నైన్ పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. కన్నబిడ్డను కిరాతకంగా చంపిన తండ్రిని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారుద.

# ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

## ● మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,మహబూబ్ నగర్:** గెలిచిన ఓడిన ప్రతి బిఆర్ఎస్ నాయకుడు కార్యకర్త ప్రజాసంక్షేమ కోసం నిరంతరం శ్రమించి పనిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా గెలిచిన కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. చాలామంది 10 15 ఓట్లతో అంచులకు చేరడం జరిగిందని కేవలం అధికార దుర్వినియోగం వల్లనే మాత్రమే కొన్నిచోట్ల బీఆర్ఎస్ ఓటమి జరిగిందన్నారు. అధికార దుర్వినియోగం అత్యధికంగా చేశారని ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అధికారం ఎప్పుడు ఎవరికి శాశ్వతం కాదని భయపెట్టి ఓట్లు పించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాలమూరు కార్పొరేషన్లో పెండింగ్లో ఉన్న పనులను చేసే బాధ్యత కార్పొరేటర్లు అందరూ తీసుకుంటారని స్పష్టం చేశారు. ఇసుక వ్యాపారంతో పాటు ఏ వ్యాపారాన్ని కూడా అధికార పార్టీ వదలడం లేదని ఇలా అబ్బాయి పెట్టి ఎన్నాళ్ళు ఉంటారు చూస్తామని, అవినీతి అక్రమాలపై తమ పోరాటం ఎల్లప్పుడూ ఉంటుందని హెచ్చరించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు ఒకసారి ఆలోచించాలని ఇది సరైన పద్ధతి కాదన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ప్రారంభించేందుకు తమ జీవన తీసుకురావడం జరిగిందని అదే జీవోను మరోసారి తీసుకువచ్చి మేమే ఆపడం తీసుకొచ్చేమని చెబుతున్నారని తెలిపారు. రైతు బజార్లో ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన నిర్మాణాలను ఇతర అవసరాలకు ఉపయోగించుకోకూడదని ఏ పనికి సంబంధించి ఆడిషన్ ఉంటుందని తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. 15 మంది పార్టీ సింబల్ నుంచి గెలవగా మరొకరు పార్టీ రెబల్ అభ్యర్థి గెలిచి పార్టీలోనే ఉంటున్నానని ముందుకు రావడం జరిగిందన్నారు. ఓటింగ్ శాతం కేవలం ఐదు శాతం మాత్రమే వేదం ఉందని బిఆర్ఎస్ వైపు ప్రజలు పూర్తిస్థాయిలో నమ్మకంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఒక రూపాయి డాక్టర్

## ● మెడికల్ టెస్టులను రూ.1కే

**టి మీడియా, ఫిబ్రవరి 14 , ఒడిశా :** సహజంగా బీపీ, షుగర్?వంటి వైద్య పరీక్షలు చేయించుకుంటేనే రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. ఆ ఖర్చుకు భయపడే చాలా మంది టెస్టులు చేయించు కునేందుకు సంకోచిస్తుంటారు. అలాంటిది ఒడిశాకు చెందిన డాక్టర్ శంకర్ రామ్‌చందాని కేవలం ఒక్క రూపాయి ఫీజుతో పేదలకు ఆరోగ్య పరీక్షలతో పాటు వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. స్థానికంగా రూపాయి డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ శంకర్ రామ్‌చందాని గురించి ప్రత్యేక కథనం.





### రూ.1కే ఖరీదైన పరీక్షలు

డాక్టర్ శంకర్ రామ్‌చందాని క్లినిక్‌లో స్పైరోమెట్రీ, బోన్ మినరల్ డెన్సిటీపరీక్షలను కూడా కేవలం రూ.1కే అందిస్తున్నారు. సాధారణంగా బయట ల్యాబ్‌లలో ఈ పరీక్షల కోసం ఒక్కోటి రూ.1000 వరకు ఖర్చవుతుంది. కానీ డాక్టర్ శంకర్ రామ్‌చందాని క్లినిక్‌లో అవే పరీక్షలు అతి తక్కువ ధరలో కేవలం ఒక్క రూపాయికే చేస్తున్నారు. ఇప్పటికే రూ.1కే ఇ సి జి, నెబ్యులైజర్ సేవలు, అవసరమైన మందులు అందిస్తున్న ఆయన, ఇటీవల ఆ జాబితాలో ఈ రెండు ఖరీదైన పరీక్షలను కూడా చేర్చారు. తద్వారా ఎక్కువ మంది రోగులకు ఆర్థిక భారం కాకుండా చూస్తున్నారు. బుర్లాలోని భీమ్‌సర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో డాక్టర్ శంకర్ రామ్‌చందాని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు ముగిసిన తర్వాత విశ్రాంతి తీసుకోకుండా పేదలు, వికలాంగులు, మహిళా రోగులకు రూ.1కే వైద్యం చేస్తున్నారు. 2016 నుంచి భీమ్‌సర్‌లో పనిచేస్తున్న ఆయన, తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బుర్లా మార్కెట్ ఏరియాలో 'లాజ్వంతి వన్ రూపీ క్లినిక్' పేరుతో ప్రారంభించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి స్పైరోమెట్రీ, యంత్రాలను కొనుగోలు చేసి తన వద్దకు వచ్చి రోగులకు రూ.1కే పరీక్షలు చేస్తూ ఔదార్యతను చాటుతున్నారు.

### ఒక్క రూపాయి క్లినిక్ వెనుక కథ

తన బాల్యంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులే ఈ సేవకు ప్రేరణగా నిలిచాయని డాక్టర్ రామ్‌చందాని చెప్పారు. తన తండ్రి, తాత క్యాన్సర్ బారినపడ్డు ఎదురైన ఇబ్బందులు అయన్ను తీవ్రంగా కలిచివేశాయి. చిన్నప్పుడు ఆయన కడు పేదరికాన్ని చూశారు. ఆయన తండ్రి బ్రహ్మానంద్ ఒక చిన్న స్టేషనరీ షాపు నడుపుతూ 32 మంది సభ్యులున్న ఉమ్మడి కుటుంబాన్ని పోషించేవారు. వైద్య ఖర్చుల వల్ల కుటుంబం ఆర్థికంగా పడిన ఇబ్బందులను చూశారు. నాడు వైద్యం కోసం పడిన ఆర్థిక ఇబ్బందులు ఆయనలో కసిని పెంచాయి. అప్పటి నుంచే పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని సంకల్పించారు. కోవిడ్ అనంతరం తల్లిదండ్రుల కల నెరవేర్చాలని భావించి 'ఒక్క రూపాయి క్లినిక్'?ను ప్రారంభించారు. ఇప్పుడు ఊపిరితిత్తుల, ఎముకల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేలా ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

### సాయంత్రం 6 నుంచి 9 వరకు సేవలు

రామ్?చందాని క్లినిక్?లో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పేద రోగులు కేవలం రూ.1కే ఈ పరీక్షలను చేయించుకోవచ్చు. దీంతో వ్యాధులను తొలిదశలోనే గుర్తించి మందులతో నియంత్రించుకునే అవకాశం లభిస్తోంది. డాక్టర్ రామ్‌చందాని భార్య డాక్టర్ శిఖా రామ్‌చందాని కూడా ఈ సేవల్లో భాగమయ్యారు. ఒక్క రూపాయి ఫీజుతో వేలాది మందికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్న ఈ వైద్యుడి సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2023లో ఒడిశా సిటిజన్ అవార్డు దక్కింది.

### భార్య కూడా రూ.1కే సేవలు

రామ్‌చందాని భార్య డాక్టర్ శిఖ కూడా వైద్యురాలే. ఆమె డెంటల్ డాక్టర్. డాక్టర్ శిఖ కూడా భర్త అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. తను కూడా రూ.1కే వైద్యం చేస్తూ భర్తకు అండగా నిలుస్తున్నారు. గతంలో కూడా తాము పేదల కోసం పని చేసిటన్లు డాక్టర్ శిఖ తెలిపారు. రానున్న రోజుల్లో కూడా వారి కోసం మరింతగా పనిచేస్తామని చెప్పారు.

# ముంబైలో కుప్పకూలిన మెట్రో పిల్లర్



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,ముంబై:** ఈశాన్య ముంబైలోని ములుండ్‌లో నిర్మాణంలో ఉన్న మెట్రో రైలుమార్గంలోని ఒక స్తంభం శనివారం మధ్యాహ్నం కూలిపోవడంతో ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులు గాయపడినట్లు అగ్నిమాపక దళ అధికారి తెలిపారు. జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ ముందు ఉన్న ఆర్టరీ ఎల్‌బిఎస్ రోడ్డులో మధ్యాహ్నం 12:20 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని అధికారి తెలిపారు. స్తంభం సిమెంట్ స్లాబ్ కూలిపోయి కింద ఉన్న ఆటోరిక్షాపై పడి, త్రిచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ముగ్గురు నుండి నలుగురు వ్యక్తులు గాయపడి ఉంటారని భావిస్తున్నారు. అగ్నిమాపక దళం, పోలీసు సిబ్బందితో పాటు మెట్రో రైలు మార్గం (లైన్ 4) నిర్మిస్తున్న సంస్థ సిబ్బంది సంఘటనా స్థలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పర్యవేక్షిస్తున్నారు" అని ఆయన చెప్పారు.

# హైవేపై ఘోర ప్రమాదం

## – ముగ్గురు మృతి



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,కల్వకుర్తి :** జడ్చర్ల–కోదాడ హైవేపై శనివారం తెల్లవారుజామున ఊర్కొండ మండలం తిమ్మన్నపల్లి వద్ద తుఫాన్ వాహనం కల్వర్ట్ కు డీ కొని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నుండి తుఫాన్ వాహనంలో శ్రీశైల దేవస్థానానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అందులో ప్రయాణిస్తున్న వారిలో రమణ గౌడ్ (52 )మేఘ దాసి (46 )మాధవి (60 )ముగ్గురు మృతి చెందారు తీవ్రంగా గాయపడిన పలువురిని వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పంచనామ నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వం తరలించారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

# మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హనుమకొండ:** మహా శివరాత్రి వేడుకల సందర్భంగా వరంగల్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ రుద్రేశ్వర స్వామి (వెయ్యి స్తంభాల ఆలయం) లో శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి శ్రీ రుద్రేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణార్థం నిర్వహించిన పార్వతి పరమేశ్వరుల కళ్యాణం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనం చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమ రెడ్డి, కుమార్తె డా. శ్రీగోదా విష్ణురెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనారిటీ నూతన సంఘం ఎంపిక



**టీ మీడియా, ఫిబ్రవరి 14,పెబ్బేరు :** పెబ్బేరు మండలం లోని అయ్యవారిపల్లి గ్రామంలో శనివారం ముస్లిం మైనారిటీ సంఘం నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం డి మహిమూద్, ఉపాధ్యక్షుడిగా ఎం డి షఫీ, ప్రధాన కార్యదర్శి గా ఎం డి అరీఫ్ ఎంపికయ్యారు. గ్రామం లోని ముస్లిం సోదరులందరూ ఉమ్మడిగా ఉండి ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు సంఘం లోని పలువురు పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

# చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక ఎలా ఉంటుంది..?

## ● సమాన ఓట్లు వస్తే ఏం చేస్తారు?



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్ బ్యూరో :** పురపోరులో విజేతలైన కొత్త కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎల్లుండి (సోమవారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరగనుంది. ఏకగ్రీవం కాని చోట చేయి ఎత్తే విధానం ద్వారా ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఇవాళ మధ్యాహ్నం వరకు నమోదు చేసుకునే అవకాశం ఉంది. చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక ఎలా ఉంటుంది? కోరం అంటే ఏంటి? సమాన ఓట్లు వస్తే ఏం చేస్తారు. తదితర అంశాల్ని ఈ కథనంలో చూద్దాం.

### చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

కొత్తగా పట్టణాల్లో కౌన్సిలర్లు, నగరాల్లో కార్పొరేటర్లు వచ్చారు. ఇక మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరగాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లో 2,594 మంది కౌన్సిలర్లు, కార్పొరేషన్లలో 414 మంది కార్పొరేటర్లుగా గెలిచారు. వీరు 16న ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. పరోక్ష ఎన్నిక ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం విధివిధానాలను వెల్లడించింది. ఎన్నిక నిర్వహించడానికి మొత్తం కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో కనీసం సగం మంది ఉంటేనే కోరంగా పరిగణిస్తారు. ఒకవేళ కోరం లేకపోతే ఛైర్ పర్సన్, మేయర్ ఎన్నిక మరుసటి రోజుకు వాయిదా వేస్తారు. ఆ రోజు కూడా కోరం లేకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఆ తర్వాత మరో రోజును ఖరారు చేసి, అప్పుడు కోరం లేకపోయినప్పటికీ ఎన్నిక నిర్వహిస్తారు.

### ఎలా ఎన్నుకుంటారంటే?

రిజర్వేషన్ల ప్రకారం ఛైర్‌పర్సన్‌లు, మేయర్‌లను ఎన్నుకుంటారు. వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్లకు రిజర్వేషన్లు వర్తించవు. మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక కోసం ఒకరే పోటీలో ఉంటే ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక నిర్వహిస్తారు. ముందుగా ఛైర్‌పర్సన్, మేయర్, ఆ తర్వాత వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ ఏదైనా కారణంతో ఛైర్‌పర్సన్, మేయర్ ఎన్నిక నిర్వహించలేకపోతే, వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా వాయిదా వేస్తారు.

### ఎక్స్ అఫీషియో సభ్యులకు ఈ రోజే అవకాశం

కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లు చేయి ఎత్తి ఓటు వేయాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంటుంది. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నమోదు చేసుకునేందుకు ఇవాల్టి వరకు అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యులు తమ నియోజకవర్గం పరిధిలోని ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉండవచ్చు. ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో మాత్రమే ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకొనే అవకాశం ఉంటుంది. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఓట్లు వేసిన తర్వాత సమానంగా ఓట్లు ఉన్నట్లయితే లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఒక్కో అభ్యర్థి పేరు 5 పేపర్లపై రాసి, అన్నీ కలిపేసి స్థానిక ఎన్నికల అధికారి లాటరీ తీస్తారు. అందులో ఎవరి పేరు వస్తే వారే విజేత.

### విప్ జారీ చేస్తే ఎల్లుండి వరకు అవకాశం

రాజకీయ పార్టీలకు విప్ జారీ చేసే అధికారం ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం సహా 13 పార్టీలకు విప్ జారీ చేసే అవకాశం ఉంది. విప్ జారీ చేస్తే ఎల్లుండి ఉదయం 11 గంటల్లోపు స్థానిక ఎన్నికల అధికారికి ఆయా పార్టీలు సమాచారం ఇవ్వాలి. పార్టీల అభ్యర్థులుగా గెలిచిన వారు విప్‌ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ విప్ ధిక్కరిస్తే ఆ పార్టీ మూడు రోజుల్లోగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అభ్యర్థికి నోటీసులిచ్చి వివరణ కోసం వారం రోజులు గడువు ఇచ్చి ఆ తర్వాత రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థికి ఆయా పార్టీలు బీ-ఫారం ఇవ్వాలి. ఎల్లుండి ఉదయం 10 గంటల్లోపు స్థానిక ఎన్నికల అధికారికి బీ-ఫారం ఇవ్వాలి.

# కరీంనగర్ కార్పొరేషన్ లో 35కు చేరిన బీజేపీ బలం

## ● చక్రం తిప్పిన బండి సంజయ్



**టి మీడియా, ఫిబ్రవరి 14 , కరీంనగర్:** కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటింది. మొత్తం 66 స్థానాలకు గాను బీజేపీ సొంతంగా 30 స్థానాలను కైవసం చేసుకుంది. ఫలితాలు వెలువడిన వెంటనే 13వ డివిజన్ నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన తెల్ల లక్ష్మీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోట చేసి గెలిచిన విపల సాయి జ్యోతి బీజేపీలో చేరారు. వీరిద్దరూ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇద్దరు బీజేపీ రెబల్ కార్పొరేటర్లు, మరో ఇండిపెండెంట్ సైతం బండి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకుని బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. దీంతో బీజేపీ సంఖ్య 35కు చేరుకుంది. వాస్తవానికి కరీంనగర్ కార్పొరేషన్ కార్పొరేటర్ల సంఖ్య 66. వీరితోపాటు స్థానిక ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్(బీఆర్ఎస్) కవ్వంపల్లి సత్యనారాయణ(కాంగ్రెస్), ఎంపీ బండి సంజయ్ (బీజేపీ) ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో మొత్తం సభ్యుల సంఖ్య 69కి చేరనుంది. ఈ లెక్కన మ్యాజిక్ ఫిగర్ 35 కావాలి. బీజేపీ ఇప్పటికే 35కు చేరుకుంది. అవసరమైతే మరో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య సైతం అవసరమైన పక్షంలో ఎక్స్ అఫీఫియో సభ్యులుగా చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే ఆ అవసరం పడే అవకాశాలు కన్పించడం లేదు. ఎందుకంటే మరో 5 గురు ఇండిపెండెంట్, ఏఐబీపీ తరపున గెలిచిన కార్పొరేటర్లు బీజేపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. రేపు (శనివారం) వారంతా బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరనున్నారు.

# న్యాయవాది స్వప్న మర్డర్ కేసు

## -మరో వ్యక్తి అరెస్ట్



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,మొయినాబాద్ :** రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో లాయర్ స్వప్న(34) హత్య చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా న్యాయవాది స్వప్న మర్డర్ కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

# రికార్డు స్థాయిలో మామిడి ధరలు



## • టన్ను రూ.1.75 లక్షలు

**టి మీడియా, ఫిబ్రవరి 14 , ఎన్టీఆర్ జిల్లా:** కాయ కాయకు కవర్లను కట్టి మరీ సాగు చేసిన బంగినపల్లి మామిడి ధర ఎంత ఉంటుందని మీరు అనుకుంటున్నారు, అక్షరాలా ఒక టన్ను రూ. 1.75 లక్షలు. అవును మీరు విన్నది నిజమే! గత కొన్నేళ్లతో పోల్చి చూస్తే టన్నుకు దాదాపు రూ. 50,000కు పైగా అధికంగా దక్కుతోంది. ఒకవేళ కవర్లను కట్టకపోయినట్లయితే టన్ను రూ.80-90 వేల మధ్యలోనే ఉంటుండటం గమనార్హం. అంటే దీని ప్రకారం సగానికి సగం తేడాను ఇందులో మనం చెప్పవచ్చు. ఈ విధంగా కవర్లను కట్టిన మామిడిని కొనుగోలు చేసేందుకు చాలా మంది ఎన్టీఆర్ జిల్లాకు వస్తున్నారు.

### మామిడి ఉత్పత్తికి సంబంధించిన వివరాలు

ప్రధానంగా తోతాపురి మామిడికి టన్నుకు గాను రూ.1.05 లక్షలు దక్కుతోంది. ఇది గతేడాదితో పోలిస్తే దాదాపు రూ.25,000 అధికం కావడం గమనార్హం. అదే విధంగా మామిడిని పచ్చళ్లుగా పెట్టేందుకు కోల్?కత్తా, పుణె ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి మామిడి కాయలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో మామిడి కోతలు మొదలయ్యాయి.జిల్లా వ్యాప్తంగా దాదాపు 22,896 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి పంట సాగవుతుంది. ఇందులో మొత్తం 2.29 లక్ష ల టన్నుల మామిడి దిగుబడి వస్తుందని ఓ ప్రాథమిక అంచనా. ముఖ్యంగా ఈ సాగులో బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలు, పెద్దరసాలు, సువర్ణరేఖ రకాల సాగు అధికంగా ఉంటుంది. మామిడి కవర్లకు 2025-26 సంవత్సరంలో రాయితీకి 1,668 హెక్టార్లకు గాను రూ. 2.50 కోట్లను కేటాయించారు.

### ఇక ఒక్కో కవర్‌కు 2 రూపాయలు ఖర్చు అవుతుంది

ఇందులో ప్రభుత్వం 50 శాతం రాయితీని కల్పిస్తుంది. బంగినపల్లి రకం టన్నుకు దాదాపు 3,000 కాయలు వరకు వస్తాయి. అయితే మామిడి కాయలకు కవర్ కట్టినందుకు కూలీలకు రూ.1.50 చొప్పున ఇవ్వాలి. దీని ప్రకారం ఒక్కొక్క మామిడి కాయకు అయ్యేటటువంటి ఖర్చు రూ.2.50 గా ఉంది. ఈ విధంగా ఒక టన్నుకు అంటే దాదాపు 3,000 కాయలకు గాను అయ్యే ఖర్చు సరాసరి రూ.7,500 వరకు అవుతుంది. ఈ విధంగా ఒక హెక్టారుకు 5 టన్నుల చొప్పున దిగుబడిని లెక్కిస్తే రూ.37,500 వరకు ఖర్చు అవుతుంది.

### కాయపై మచ్చలుంటే తక్కువ ధరకే

అంతేకాకుండా అదనంగా ఒక హెక్టారుకు రూ. 3 లక్షలపైనే ఆదాయం సమకూరుతుంది. సాధారణ మామిడితో పోలిస్తే కవర్?ను ధరించిన మామిడికి ఒక టన్నుకు గాను రూ. 60-80,000 వరకు అధికంగా ఆదాయమనేది సమకూరుతుంది. ఇలా 5 టన్నులకు గాను మొత్తం రూ. 3.50 లక్షలు అధికంగా ఉంటుంది. అందులో కవర్లకు అయ్యేటటుంటి ఖర్చు రూ.37,500 పోగా మిగులు సరాసరి రూ. 3,12,500 వరకు వస్తుందని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రైతు కృపారాజు అనే వ్యక్తి వివరించారు. మామిడి సాగులో సాధారణంగా తెగుళ్లు అనేవి ఇబ్బందికరంగా ఉంటాయి. అందుకు గాను రైతులు తెగుళ్ల నివారణకు గాను రసాయనాలను పిచికారీ చేస్తారు. దాంతో మామిడి కాయలపై మచ్చలనేవి విరివిగా ఏర్పడతాయి. అందుకే వీటికి తక్కువ ధర పలుకుతుంది.

### ఇలా చేస్తే అధిక ధరకు

మామిడి సాగు సమయంలో కాయలు చిన్నగా ఉన్నప్పుడే రైతులు వాటికి కవర్లను తొడుగుతారు. ఈ విధంగా మొత్తం 50 రోజులపాటు కవర్?లోనే ఉంటాయి. ఆ తర్వాత కవర్లు ఉన్నన్నాళ్లూ మామిడి కాయలపై ఏ విధమైన తెగుళ్ల ప్రభావమనేది దరిచేరదు. ఒకవేళ రసాయనాల పిచికారీని చేసినప్పటికీ దాని ప్రభావం కాయలపై ఏ మాత్రం ఉండదు. దాంతో మామిడి నాణ్యతతో కూడి ఉంటుంది. అంతేకాకుండా మంచి ఆకర్షణీయ రంగులో నిగనిగలాడుతుంది. అందుకే వ్యాపారులు అధిక ధరైనా సరే వీటిని వెచ్చించడానికి ఏ మాత్రం వెనకాడటం లేదు.

---

## హ్యాట్రిక్ కౌన్సిలర్ నీరజ బాల్ రెడ్డి కే ఛాన్స్...?

### • విధేయతే ప్రామాణికం..



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,తాండూరు:** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ లో వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణమైన మెజారిటీ రావడంతో చైర్పర్సన్ అభ్యర్థి ఎవరనేది ఉత్కంఠంగా మారింది. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నిర్ణయం మేరకు అభ్యర్థి ఎవరన్నది తేలనున్నట్టు సమాచారం. అయితే ప్రధానంగా విధేయతే ప్రామాణికంగా చైర్పర్సన్ అభ్యర్థి ఎంపిక జరగనుందని తెలిసింది. కౌన్సిలర్ గా హ్యాట్రిక్ విజయం సాధించిన 12వ వార్డు కౌన్సిలర్ నీరజ బాల్ రెడ్డి కే చైర్ పర్సన్ పీఠం దక్కే ఛాన్స్ ఉంది. గతంలో ఆమె అధికార, విపక్షంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యలపై అనర్ఘళంగా అధికారులను, పాలకులను నిలదీసి గళమెత్తారు. మున్సిపల్ పాలన తీరుపై స్పష్టమైన అవగాహన ఉన్న నీరజకె చైర్ పర్సన్ పీఠం దక్కనుందని సమాచారం. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తో పాటు తాజాగా గెలుపొందిన మెజారిటీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు అధిష్టానానికి నీరజ పేరును ప్రతిపాదించే అవకాశం ఉంది. మున్సిపల్ చైర్పర్సన్ గా మొదటిసారి కౌన్సిల్లో అడుగుపెడుతున్న 27వ వార్డు నుండి గెలుపొందిన స్వరూప మరియు 11 వార్డు నుండి మొదటిసారి గెలుపొందిన బంటు వేణు పేరు కూడా వినిపిస్తోంది.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

**టి మీడియా, ఫిబ్రవరి 14 ,కాగజ్ నగర్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులుక్షేత్ర పర్యటనలో భాగంగా మహారాష్ట్రలోని విసాపూర్ లో గల బొటానికల్ గార్డెన్ సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. కళాశాల వృక్ష మరియు జంతు శాస్త్ర విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొని పలు విషయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు ఆయా అంశాలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడుతుందని పేర్కొన్నారు.బొటానికల్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ పరికరాలపై ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు.

## కల్యాణ వేంకటేశ్వరుస్వామి స్నపన తిరుమంజనం



**టీ మీడియా ,ఫిబ్రవరి 14, తిరుముల :** శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఆలయ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ప్రధాన అర్చకుడు శ్రీ శి...రి పర్యవేక్షణలో స్నపన తిరుమంజనం (పవిత్ర స్నానం) ఘనంగా జరిగింది.

**సూర్య ప్రభ వాహనంపై శ్రీ సూర్యనారాయణ స్వామి**

శ్రీనివాస మంగాపురంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సూర్యప్రభ వాహనంపై మండే ప్రకాశవంతమైన పగటి వెలుగులో, శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు శ్రీమన్నారాయణుడిగా మెరిసిపోయాడు. నారింజ ఇక్సోరా దండలతో చక్కగా అలంకరించబడిన ఉత్సవ దేవత యొక్క దివ్య ఆకర్షణ .

**కల్పవృక్ష వాహనంపై శ్రీ కపిలేశ్వరస్వామి కను విందు**

శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో శనివారం శ్రీ కపిలేశ్వరుడు కల్పవృక్ష వాహనంపై విహరించాడు. ఏడవ రోజున వాహనం ముందు నృత్య బృందాల గొప్ప భక్తి విందు మధ్య దేవత తన మతపరమైన వైభవంతో భక్తులను ఆశీర్వదించాడు. తరువాత ఊరేగింపు దేవతలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సూపరింటెండెంట్ శ్రీ .

**మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం**

చంద్రగిరి మండలం కందులవారిపల్లిలోని శ్రీ శేషాచల లింగేశ్వర స్వామిఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి.ఇందులో భాగంగా కలశ స్థాపన, గణపతి, నవగ్రహ, రుద్ర, దుర్గా హోమాలు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 15న మహాశివరాత్రి సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించనున్నారు.



## సన్మానం చేసిన బిజెపి కౌన్సిల్ మెంబెర్

**టీ మీడియా ,ఫిబ్రవరి 15, ఆత్మకూరు :**వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల లో బీజేపీ తరపున పోటీ చేసి గెలిగిన అభ్యర్థులు లలితరాజు , పుల్లరి భరత్ ,జిందే జ్యోతిశ్రీనివాస్ నుతెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ కంబలపూరం రాము ఆత్మకూర్ కార్యాలయంలో శాలువాతో సన్మానం చేశారు . ఈ సందర్భంగా మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ మాట్లాడుతూ ఆత్మకూర్ ప్రజా తీర్పు ను గౌరవిస్తూ ఆత్మకూర్ అభివృద్ధి కి సహకరిస్తూ నిరంతరం ఆత్మకూర్ మున్సిపల్ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం అని రాబోవు కాలంలో తెలంగాణ రాష్ట్రం లో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టబోయే పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ పట్టణ అధ్యక్షులు మండ్ల సురేష్ , జిల్లా నాయకులు ఆనంద్ , ఆంజనేయులు ముద్దిరాజ్ , ప్రధాన కార్యదర్శి పుల్లరి రమేష్ , సీనియర్ నాయకులు జిందే శ్రీనివాస్ , మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# పోకిరీల ఉన్మాదం..



## • కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లి..

**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్ బ్యూరో :**రాజధాని నగరంలో పోకిరీల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. సైరన్లు వేసుకుంటూ రోడ్లపై హంగామా సృష్టించడమే కాకుండా, ప్రశ్నించిన వారిని ప్రాణాలతోనే ఈడ్చుకెళ్లే స్థాయికి వీరి ఉన్మాదం చేరింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో తాజాగా చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఒక సామాన్య ప్రైవేట్ ఉద్యోగిని బొలెరో కారుతో ఢీకొట్టి, కిలోమీటరు దూరం ఈడ్చుకెళ్లి, అతని ప్రాణాలను గాలిలో కలిపే ప్రయత్నం చేశారు కొందరు యువకులు.బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ అనే వ్యక్తి ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. విధి నిర్వహణ ముగించుకుని రాత్రి సమయంలో తన కారులో ఇంటికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒక బొలెరో కారులో ఉన్న కొందరు యువకులు కారుకు సైరన్ వేసుకుంటూ, అతివేగంతో రోడ్డుపై హంగామా సృష్టించారు. సతీష్ కారును బొలెరోతో బలంగా ఢీకొట్టిన ఆ యువకులు, కనీసం ఆపకుండా వేగంగా వెళ్లిపోయే ప్రయత్నం చేశారు.దీంతో సతీష్ వారిని వెంబడించి కొంత దూరం వెళ్ళాక ఆపగలిగాడు. కారు దిగి దుండగుల బొలెరోకు ఎదురుగా నిల్చుని, ఎందుకు ఢీకొట్టారని ప్రశ్నించే ప్రయత్నం చేశాడు. అయితే, ఏమాత్రం కనికరం లేని ఆ యువకులు కారును సతీష్ వైపు వేగంగా పోనిచ్చారు. కారు వేగంగా రావడంతో సతీష్ కిందపడిపోయి, ప్రాణ రక్షణ కోసం బొలెరో ముందున్న బంపర్‌ను గట్టిగా పట్టుకున్నాడు. కారు కింద మనిషి ఉన్నాడని తెలిసినా, ఆ పోకిరీలు కనికరించలేదు. సుమారు 700 మీటర్ల నుండి ఒక కిలోమీటరు వరకు అలాగే ఈడ్చుకెళ్లారు. ఆ భయంకరమైన రాపిడికి సతీష్ వీపు భాగం అంతా రోడ్డుకు గీసుకుపోయి తీవ్రంగా దెబ్బతింది. నొప్పి భరించలేక సతీష్ బంపర్ వదిలేయగా, ఆ కారు అతనిపై నుంచే దూసుకెళ్లిపోయింది.కారు కింద పడి ఈడ్చుకెళ్లడం వల్ల సతీష్ ప్రైవేట్ పార్ట్స్ పూర్తిగా డ్యామేజ్ అయ్యాయి. కాలు విరగడంతో పాటు వీపు భాగం మొత్తం చెక్కుకుపోయింది. ప్రస్తుతం సతీష్ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ ఘటన జరిగి ఇంత దారుణం జరిగినా పోలీసులు నిందితుల వివరాలను వెల్లడించకపోవడంపై సతీష్ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పౌరుల కారుకు పోలీసుల లాంటి సైరన్ ఎలా ఉంది? ఆ కారులో ఉన్న యువకులు ఎవరు? వారు మద్యం లేదా గంజాయి మత్తులో ఉన్నారా? నిందితుల వెనుక ఎవరైనా రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఉన్నారా? అందుకే పోలీసులు వివరాలు దాస్తున్నారా? అని బాధిత కుటుంబం ప్రశ్నిస్తోంది.

---



# ఫార్ములా ఈ కార్ రేస్...

### • అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్

**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్ బ్యూరో :** ఫార్ములా ఈ కార్ రేస్‌లో కీలక పరిణామం జరిగింది. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా ఈ కార్ రేసుపై ఇప్పటికే ఏసీబీ విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇప్పటికే కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు కూడా గవర్నర్ అనుమతి ఇచ్చారు. ఈ కేసులో రాజకీయ, అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జ్‌షీట్‌కు దాఖలు చేసేందుకు సిద్ధమైంది.ఫార్ములా ఈ కార్? రేసు'లో హెచ్ఎమ్‌డీఏ భాగస్వామి కాకపోయినా, దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్లు చెల్లించారు. ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే కేటీఆర్ ఇందుకు ఒత్తిడి తెచ్చారని ఏసీబీ నివేదికలో వెల్లడించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు చేయడం మరో అభియోగం.నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఫార్ములా -ఈ కార్ రేసుకు సంబంధించి మూడేళ్లలో 600 కోట్ల రూపాయలు చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్టు దర్యాప్తు సంస్థలు తేల్చాయి.



## శివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు

**టి మీడియా ,ఫిబ్రవరి 14, అమరావతి :**ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ శైవ క్షేత్రాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచారామ క్షేత్రాలతో పాటు ప్రముఖ శైవ ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ముఖ్యంగా కోటప్పకొండ, అమరావతి, దైద క్వారీ , గోవాడ వంటి క్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం అధికారులు ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ ఏర్పాట్లు చేపట్టారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో వెలసిన త్రికోటేశ్వర స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ ఏడాది శివరాత్రికి సుమారు 3 నుండి 5 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కోటప్పకొండ ప్రత్యేకత అయిన విద్యుత్ ప్రభలు ఇప్పటికే వివిధ గ్రామాల నుండి కొండకు చేరుకుంటుండటంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. అయితే శివరాత్రికి ముందే, అంటే శనివారం మధ్యాహ్నం నుండే భక్తుల తాకిడి ఊహించని విధంగా పెరగడంతో కొండకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ వాహనాలతో పూర్తిగా నిండిపోయాయి.

## మున్సిపల్ పోరులో 'హస్తం' జోరు

### -ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న రాహుల్, ఖర్గే



**టి మీడియా, ఫిబ్రవరి 14 ,హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం పట్ల పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ రాహుల్ ఎక్స్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రశంసనీయమైన విజయాన్ని అందించిన అంకితభావం కలిగిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు నా కృతజ్ఞతలు. పీపుల్స్ తెలంగాణ నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా కాంగ్రెస్ పయనిస్తుందని స్పష్టం చేశారు.ప్రజల నమ్మకానికి నిదర్శనం: మల్లికార్జున ఖర్గేమున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు నమ్మకం ఉంచారని, ఆ నమ్మకమే ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని ఖర్గే పేర్కొన్నారు.

---



## మహాశివరాత్రి వేళ భగ్గుమన్న పండ్ల ధరలు

**టి మీడియా, ఫిబ్రవరి 14 ,ఘట్ కేసర్:**

మహాశివరాత్రి సందర్భంగా వివిధ రకాల పండ్లకు మంచి గిరాకి ఉండటంతో వాటి ధరలు భగ్గుమన్నాయి. శివరాత్రిని పురస్కరించుకొని ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు సాయంత్రం దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించిన తరువాత పండ్లు తినడం అనవాయితీ. దీంతో తప్పనిసరిగా పండ్లు కొనుగోలు చేయాల్సి ఉండగా ధరలు మాత్రం చుక్కలనంటాయి.ఇదే అదనుగా పండ్ల వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తూ రెండు చేతులా ఆర్జిస్తున్నారు. పండగ సందర్భంగా గిరాకి అధికంగా ఉండటంతో ఘట్ కేసర్ పట్టణ కేంద్రంలోని బస్ టర్మినల్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ రహదారి పొడవునా ఇటు ఎదులాబాద్ రోడ్డులో టెంట్లు వేసుకొని పండ్ల వ్యాపారులు పోటీపడి మరీ విక్రయిస్తున్నారు. పండ్ల ధరలను పరిశీలిస్తే ద్రాక్షకిలో రూ.60 నుంచి 80, పుచ్చకాయ రూ.80 నుంచి 120, కర్బూజ రూ.70 నుంచి 100, అరటిపండ్లు డజను రూ.40 నుంచి 60, సంత్రాలు ఒకటి రూ.10, ఆపిల్ రూ.25 చొప్పున విక్రయించారు. పండగ రోజు ఉపవాస దీక్ష చేసే వారికి తప్పనిసరిగా పండ్లు అవసరం ఉండటంతో ధరలు ఎంత ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేసినట్లు భక్తులు తెలిపారు. ఏది ఏమైనా ఇంతమంచి సమయం మించితే దొరకదు అనే విధంగా ఇష్టానుసారంగా వ్యాపారులు వ్యవహరించాలని భక్తులు చెప్పారు.



## మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**టి మీడియా, ఫిబ్రవరి 14 ,ఘట్ కేసర్:**

ఘట్ కేసర్ పట్టణం శివారెడ్డి గూడాలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ స్వామి, మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీ ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త కొంతం రామిరెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు అభిషేకములు, 9 గంటల నుండి 12 గంటల వరకు అర్చనలు జరుగుతాయన్నారు.సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అర్చనలు, రాత్రి 11:45 గంటలకు అంగోధ్భవ కాల అభిషేకము జరుగుతుందన్నారు. ముందు రోజు 14వ తేదీన శనివారం ఆలయంలో సాయంత్రం 5 గంటలకు శ్రీభ్రమరాంభ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరుగును కావున భక్తజనులు ఈ యొక్క పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని దేవాలయ ధర్మకర్త కొంతం రాంరెడ్డి కోరారు.